# మృగయా వినోదం

విజయవాడలో ఆ హోటల్లో అడుగు పెడుతుంటేనే చాలా ఆశ్చర్యం' భయం కలిగాయి ఆ అమ్మాయికి, నడుస్తే అరిగిపోతుందన్నట్టుంది ఆ నేల. నిగనిగ మెరుస్తూ పాదం పడితే పాడయిపోతుందేమోననే భయంతో అడుగు అడుగు అతి జాగ్రత్తగా వేస్తోంది ఆ అమ్మాయి. అంత ఖరీదయిన హోటల్లో ఏ గదీ ఖాళీ లేకుండా వుండటం మరీ చిత్రంగా అనిపించింది, సోఫాలో ఒదిగి ఒదిగి కూచున్న ఆ అమ్మాయి ఊపిరి బిగ పట్టి అటుఇటు చూస్తోంది. ఇప్పుడే వస్తాను అని చెప్పి వెళ్ళిన విజయబాబు ఇంకా రాలేదు....ఎంత సేపు ఇక్కడ కూచోటం? చేతుల గాజుల వంక చూసుకుందొకసారి. ఆకుపచ్చని, ఎర్రని మట్టిగాజులు పాతవయి పోయాయి. ఈ గాజులన్నీ ఒకే చేతికి వేసుకుంటే ఒకటి, ఒకటిగా గాజులు తీయటం మొదలుపెట్టింది. నాలుగు గాజులు బాగానే వచ్చేసాయి. ఐదో గాజు ఠక్కున విరిగింది. గాజుముక్క గీరుకుని చేతిపక్కగా రక్తపు రేఖ మెరిసింది. కిందపడ్డ గాజు ముక్కలు గబగబా ఏరి సోఫామూల పాడేసింది.

"పదినిముషాలలో బస్ బయలుదేరుతుంది." పాన్ నములుతూ విజయబాబు ఆ అమ్మాయివంక చూస్తూ అన్నాడు.

"ఎక్కడికి?" చేతికున్న గాజువంక చూస్తూ అంది. "మీ అంకుల్ చెప్పలేదా? హైదరాబాదుకి."

"ఓ....చెప్పాడు. హైదరాబాదులో ఒక గొప్పవాళ్ళింట్లో పని పిల్లలా వుండటానికి వెడుతోందీ తను. మంచి తిండి, మంచి బట్ట ఇస్తారు ఆ యజమాని, అదే ఈ విజయబాబుగారు చాలా మంచివాడట!" మామయ్య చెప్పాడు.

*                    *                    *

"హాయ్‌డాడీ" గుమ్మంలో అడుగుపెట్టేసరికి ఎదురొచ్చింది పద్నాలుగో పది హేనో ఏళ్ళుంటాయి. పాంటు, షర్టు, కత్తిరించిన జుట్టు, పల్చగా, ఎర్రగా వుంది రాజీ, విజయబాబు కూతురు. "నీకోసం ఓ మంచి ఫ్రెండుని తెచ్చాను. ఈ అమ్మాయి నీకు ఫ్రెండు, మమ్మీకి అసిస్టెంటు, మరి నాకు...." ఎదురుగా నిలబడ్డ అమ్మాయివంక చూస్తూ అన్నాడు విజయబాబు.

ఆ అమ్మాయి తలవంచుకు నించుంది....తల్లీ తండ్రీ రైలు ప్రమాదంలో మరణిస్తే, మామయ్య తనని తీసుకొచ్చాడు. అప్పుడు తనకి పదకొండేళ్ళు.... ఈ నాలుగేళ్ళుగా మామయ్య ఇంట్లోనే వుంటూంది. మామయ్యకి ఐదుగురు ఆడపిల్లలు. తను వాళ్ళకి బరువే నిజానికి. అందుకే, తనని విజయబాబుతో పంపడానికి మామయ్య వెంటనే నిశ్చయించాడు. విజయబాబు భార్య, చాలా మంచిదట. వాళ్ళ అమ్మాయికి తోడుగా వుండటానికి తనని తీసుకొచ్చాడు విజయబాబు. తనకి తిండికి, బట్టకి లోటు వుండదు. ఇంకేం కావాలి తనకి - ఆ అమ్మాయి ఎటో చూస్తోంది.

"నీ పేరేమిటి?" – రాజీ ఆ అమ్మాయికేసి చూస్తూ అంది.

"అరుణ."

"ఛీ. చెత్త పేరు – వీణ అని మార్చుకో."

అరుణ నవ్వేసి ఊరుకుంది.

"డాడీ– దీన్ని వీణ అని పిలుద్దాం. అరుణ అనే పేరంటే నాకు చాలా కోపం. అప్పుడు మన చిన్న గదిలో వుండేదే– దాని పేరు కూడా అరుణే కదూ– మమ్మీ గొలుసులు అది పెట్టుకునేది. పైగా అవి మీరే యిచ్చారని అబద్ధాలు చెప్పేది– పైగా"– రాజీ గబగబా మాట్లాడుతుంటే "రాజీ, లోపలికి రా" కేక పెట్టింది తల్లి జానకమ్మ.

"ఇది నీ గది. నీ వస్తువు లిందులో వుంచుకో– ఇక్కడే పడుకో– భయం లేదు. లైటు వుంది–" విజయబాబు వెంట ఆ గదిలోకి నడిచింది అరుణ.

"నువ్వేం పనులు చేయాలో అమ్మగారి నడిగి తెలుసుకో"– తల ఊపింది అరుణ.

నాలుగు రోజులయినా ఆ ఇంట్లో ఎవరు ఏ పని చేస్తారో, ఎవరికి ఏం పని వుందో పూర్తిగా అర్థం కాలేదు అరుణకి. ఆ ఇంట్లో వుండే మనుషులుకాక – పని చేయటానికుండే వాళ్ళు – పనిమనిషి, వంట మనిషి, ఇద్దరు డ్రైవర్లు, మరో పనికుర్రాడు– అబ్బ, ఎందరో– ఏమైతే నాకేం? నాకు హాయిగా భోజనం, మంచి వసతి దొరికాయి. విజయబాబు గారు, జానకమ్మగారు, రాజీ అమ్మాయిగారూ– అంత మంచివాళ్ళు. నాకు బాగానే వుందిగా– కానీ ఏ పనీ లేకుండా వుండటమే బాగాలేదు... ఈ ఇంట్లో అన్నీ ఉన్నాయి కానీ ఏదో వెలితి వుంది– ఏమిటో మరి!!– అరుణ అలా అనుకుంటూ వుండగా ఒక్కసారి తన తల్లి తండ్రి గుర్తొచ్చారు.... సాయంత్రం పనినుంచి వస్తూ తండ్రి పూలు కొని తెచ్చేవాడు. వేసవికాలంలో ఎన్నో మల్లెపూలు.... అమ్మ ఆ పూలన్నీ ఎన్నో మాలలు గుచ్చేది– తన జడలో చిన్న దండ పెట్టి, అమ్మ పెద్ద దండ జడలో పెట్టుకునేది. కబుర్లు చెప్పుకుంటూ అన్నం తినేవారంతా. హాయిగా నిద్రపోయేవారంతా– ఎంత బావుండేవి ఆ రోజులు!!– ఇంతకీ తనే దురదృష్టవంతురాలు! అరుణకి వెంటనే మామయ్య జ్ఞాపకం వచ్చాడు. అత్తా మామ

రోజూ ఏదో విషయానికి పోట్లాడుకునేవారు. అయినా మామ పనినుంచి వచ్చేసరికి వేడిగా అన్నం సిద్ధం చేసేది. ఇద్దరూ ఎంతో ప్రేమగా వుండే వారు. పిల్లలందరినీ ఇంట్లో వుంచి సినిమాకెళ్ళిపోయేవారు.

మరి ఈ ఇంట్లో ఏమిటో– మగా, ఆడా వస్తూనే వుంటారు. అమ్మగారికి ఎవరితోనూ ఏమీ సంబంధం లేనట్టుగా లోపలే వుంటుంది. బయటకి రాదు– ఇంక, ఆ కూతురు– తండ్రిమీద కోపమో, భయమో తెలియదు కాని, ఏదో వుంది మనసులో– అరుణ అలా అనుకుంటూ జానకమ్మ దగ్గర కొచ్చింది.

"ఇలా రా – అన్నం తిన్నావా?" జానకమ్మ అరుణని నఖశిఖ పర్యంతమూ పరీక్షగా చూస్తూ అంది,

"ఆ"–

"నీ కెన్నేళ్ళు."

"పది హేనండి."

"తప్పు– ఇరవై ఏళ్ళుంటాయి నీకు. మీకు లెక్కలు సరిగ్గా తెలియవులే -" అంది జానకమ్మ అరుణకి ఖచ్చితంగా ఇరవై ఏళ్ళు వుండి తీరాలనే భావంతో, పుష్టిగా, నల్లగా చాలా ఆరోగ్యంగా వున్న అరుణని చూస్తూ. అలా పది నిమిషాలు గడిచాయి.... జానకమ్మకి అరుణని చూస్తుంటే జాలేసింది. తిండి, బట్ట కోసం ఈ ఇంట్లో కొచ్చిన వెర్రిపిల్ల! వలలో చిక్కుకున్న మరో జింకపిల్ల!! 'మృగయా వినోదం' చిత్రం కళ్ళముందు నిలిచి భయపెట్టింది జానకమ్మని.

"ఇక్కడ పనేమీ లేదండి – నాకేం తోచటంలేదు. మా వూరికి వెళ్ళిపోతా" – అరుణ కాలి బొటనవేలితో నేల రాస్తూ అంది.

"వెళ్ళిపోతావా ... నేను పంపించేస్తాలే. అయినా ఈ ఇంట్లో పనులేమున్నాయి నువ్వు చేసేవీ! మా అమ్మాయికి తోడుగా వుంటావని తెచ్చారుట – ఏమిటో – నేను పంపించేస్తాలే" – జానకమ్మ మాటలకి చాలా ఆనందమేసింది అరుణకి.

"రేపు పంపిస్తారా అండి" అంది ఉత్సాహంగా.

"ఏమిటి? ఊరెళ్ళిపోతావా? ఎందుకూ? నీ కిక్కడ తోచకపోతే – అదే, పనేం లేకపోతే, నిన్ను స్కూల్లో చేర్పిస్తాను. మీ మామయ్యకి అదే చెప్పాను." విజయబాబు ఆ గుమ్మం దగ్గరే వున్న విషయం గ్రహించలేదు అరుణ అప్పటివరకు. విజయబాబుగారు ఎంత మంచివారో, స్కూల్లో చేర్పిస్తారు నన్ను – మురిసిపోతూ అరుణ ఆ గదిలోంచి బయట కొచ్చింది.

మెట్ల దగ్గర డ్రైవర్ కనిపించగానే, "రామూ, నన్ను స్కూల్లో చేర్పిస్తారట అయ్యగారు" అంది అరుణ. వాడు ఫక్కున నవ్వాడు. "స్కూల్లో చేర్పించటానికి నిన్ను ఇక్కడికి తెచ్చారు, వెర్రి పిల్ల...." ఆ మాట అంటూ గబ గబా వెళ్ళిపోయాడు రాము. మెట్ల దగ్గర విజయ బాబు నిల్చునే వున్నాడు.

"అంటే, తనని స్కూల్లో చేర్పించరా?" అరుణ మనసులో అనుమానం కలిగింది వెంటనే. అరుణకి మనసు బాగాలేదు. మామయ్య ఇంట్లో వుండి రెండిళ్ళల్లో పనిమనిషిగా వుంటే ఎంత హాయిగా వుండేదో! ఇంత దూరం ఎందుకొచ్చినట్టూ? అరుణ గదిలో కూచోగానే రాజి వచ్చింది.

"రాజీ! ఈ గదిలో అదివరకు ఎవరుండేవారూ?" అరుణ ఆ మాట అడగ్గానే రాజీ లేచి తలుపు దగ్గరగా వేసి వచ్చింది. గొంతు తగ్గించి, "నేను చెప్పానుగా – అరుణ అనే అమ్మాయి వుండేదని – అది మా అమ్మ నగలు పెట్టుకొనేది, మా అమ్మ చీరలు కట్టుకొనేది. అది దొంగది. దాన్ని దొంగ అంటే కోపం .... పైగా ఇవన్నీ మా నాన్న దానికిచ్చాడు అని అబద్ధం చెప్పింది .... ఒక రోజున నాన్నకి అమ్మకి పెద్ద పోట్లాట జరిగింది. ఆ రాత్రి అది మేడ మీదనుంచి దూకి...."

"దూకిందా?" అరుణ కళ్ళు పెద్దవి చేసింది.

"దూకి, చచ్చిపోయింది...."

"అయ్యో, పాపం" అరుణ భయంగా అనేసింది పైకి.

"రాజీ, రా, ఎంతసేపూ అక్కడ?" — జానకమ్మ అరుస్తోంది.

రాజీ పరిగెత్తింది గబ గబా గది వదిలి.

అరుణకి భయం ఎక్కువైపోయింది .... ఈ ఇంట్లోంచి వెళ్ళిపోవాలి త్వరగా .... అరుణ ఆ గది కిటికీలోంచి చూస్తోంది.

"అయ్యగారు రమ్మంటున్నారు, రా" డ్రైవరు రాము కేక పెట్టాడు.

అరుణ భయం భయంగా, బెదురుతూ, బెదురుతూ వచ్చి విజయబాబు ఎదుట నిలబడింది.

"ఎల్లుండి బాగుంది, నిన్ను స్కూల్లో చేర్పిస్తా .... మీ మామయ్య దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అక్కడంతా బాగున్నారట." విజయబాబు అరుణ వంకే చూస్తున్నాడు. 'దీనికి పదిహేనేళ్ళని మామ చెప్పాడు కానీ, దీనికి పద్దెనిమిదేళ్ళుంటాయి' మనసులో అనుకుంటూ "ఊ, నువ్వెళ్ళు" అన్నాడు.

ఆ రోజు అన్నం తిన బుద్ధి పుట్టలేదు .... తను వెళ్ళిపోవాలి .... ఎందుకో విజయబాబు అంటేనే భయం కలుగుతోంది .... ఇక్కడెవరూ తనకి తెలియదు .... రాజీ ఎన్నో విషయాలు చెప్తుంది .... కానీ ఆ అమ్మాయికి కూడా ఇష్టం లేదా తను అక్కడ వుండటం!!

రాత్రి తొమ్మిది గంటలు దాటింది. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. గదిలో లైటు వెలుగుతూనే వుంది. ఔట్‌హౌస్‌లో వుంటాడు రాము. వాడు, వాడి ముసలి తల్లి, తమ్ముడు .... అంతా ఈ ఇంట్లో పనివాళ్ళే. ఆ రాముని పిలిచి కాసేపు ఏదన్నా మాట్లాడితే హాయిగా ఉంటుందిగా.... అరుణ అలా అనుకుంటూ గది తలుపు తీసింది.... క్షణం విస్తుపోయింది! ఎదురుగా విజయబాబు .... "ఇది నీ కోసం తెచ్చాను" ఎర్రటి సిల్కు చీర అరుణ పైకి విసిరాడు. నేల మీద పడ్డ ఆ ఎర్రటి చీరని చూస్తుంటే రక్తపు మడుగు కళ్ళ ముందు కదిలింది. అరుణ గట్టిగా కళ్ళు మూసుకుంది.

"ఏం, నీ గదిలోకి రాకూడదా? కూచో..."— విజయబాబు అరుణ భుజం మీద చేయి వేశాడు.

అరుణ చెయ్యి విదిలించుకుంది. అంతలోకే ఎవరిదో దగ్గు .... ఎవరదీ? .... పోర్టికోలో లైటు వెలిగింది. విజయబాబు గబగబా వెళ్ళిపోయాడు.

అరుణ భయం మరీ ఎక్కువై పోయింది. ఎవరు మంచివాళ్ళో, ఎవరు చెడ్డవాళ్ళో ఎలా తెలుస్తుంది? మామయ్య మంచివాడా, కాడా? విజయబాబు? అరుణ లైటు ఆర్పకుండా అలానే కూచింది. నిద్ర రాదు! ఏం చేయాలో తోచదు. తెల్లవారు ఝామున నాల్గు గంటలు గడియారం కొట్టింది. అరుణ నెమ్మదిగా గది దాటింది. అడుగు అడుగు వేసుకుంటూ గేటుదాకా వచ్చింది. గేటుకి తాళం — గేటు దూకితే!! అటు ఇటు చూస్తోంది. బెదురు కళ్ళతో జింకపిల్లలా వుంది అరుణ .... ఎటు పారిపోవటం!!

"నేను తలుపు తీస్తా - పారిపో, చచ్చిపోకు" — గేటు తాళం తీస్తున్న రాజీని చూసి నోట మాట రాలేదు అరుణకి. "ఊఁ, వెళ్ళిపో" — అరుణ పరిగెత్తింది.

రాజీ హాయిగా ఊపిరి తీసుకుంది. లోపలకొచ్చి మంచంపై వాలిపోయింది.

విజయబాబు అదే సమయంలో భార్యని కౌగలించుకుని గాఢ నిద్రలో మునిగిపోయాడు.

*   *   *

తెల్లవారింది. అరుణ పారిపోయిందన్న విషయం ఇంట్లో అందరికీ తెలిసిపోయింది. "అయినా అందర్నీ నమ్మి ఇంట్లోకి తేకూడదు బాబూ. ఇంట్లో ఏ వస్తువులు పోయాయో చూసుకోండి" వంటింట్లోంచి వంట మనిషి మాటలు వినిపించుకోలేదు ఎవరూ.

"రాత్రే నా కెందుకో అనుమాన మొచ్చింది. ఆ పాలవాడి

తమ్ముడితో లేచిపోయి వుంటుంది — అంతే" పేపరు ముఖానికి అడ్డం పెట్టుకుని కాఫీ చప్పరిస్తూ అన్నాడు విజయబాబు.

"మీకు తెలుసా?" పేపరు ముఖాన అడ్డం పెట్టుకుని భర్తతో అంది జానకమ్మ.

"తెలిసినా తెలియకపోయినా అంతే, ఎవరడిగినా అదే చెప్పాలి."

"మీరు చేసే పనులకి...." జానకమ్మ మాట పూర్తి చేయలేదు. విజయబాబు గొంతు పెరిగింది.

అక్కడే కాఫీ కప్పు చేత్తో పట్టుకు నించున్న రాజీ, ఈ రెండు గొంతుకలు విని, కప్పు నేల మీద విసిరికొట్టి వెళ్ళిపోయింది. భార్యాభర్త ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

*   *   *

కాలం నడవదు. పరిగెడుతుంది.

రాజీకి పాతికేళ్ళు దాటిపోయాయి. పెళ్ళి చేసుకోదు. పెళ్ళి అంటే అసహ్యం, మగవాడంటే కోపం, ద్వేషం, కసి — తను పెళ్ళి చేసుకోదు. ఏమవుతుందో చూద్దాం — తనే కాదు, తన లాగే, అరుణ కూడా పెళ్ళి చేసుకుని వుండి వుండదు — అవును, అరుణ, నేను — పెళ్ళి చేసుకోము. ఎవరికి నష్టం? - తండ్రి గొంతు నొక్కి చంపేస్తే బాగుండును అనిపించింది. కానీ ఎవరు చెస్తారీ పని? రాజీ కళ్ళు కోవంతో ఎర్రబడ్డాయి. ఇంట్లోంచి బయటకొచ్చింది, కూరలబుట్ట పట్టుకుని నడక వేగం సాగించింది. ఇస్త్రీ లేని మడతలుపడ్డ చీర, పిలక జడ, కాళ్ళీడ్చుకుంటూ నడుస్తోంది రాజీ.

కూరగాయల మార్కెట్ దగ్గర కూరలు కొంటున్న అరుణ దూరంగా కనిపిస్తున్న వ్యక్తిని చూసి విస్తుపోయింది. 'మనిషిని పోలిన మనుషు లుంటారట. ఈమె ఆమేనా?' మరీ శ్రద్ధగా గమనించింది .... గబ గబా నడిచింది ముందుకి.

"రాజీగారూ! .... అమ్మాయిగారూ మీరేనా?" ఆశ్చర్యంగా ముఖం లోకి చూస్తూ అంది అరుణ.

"అరుణా! నువ్వా! ఎన్నేళ్ళయింది?" ఆపాదమస్తకం చూస్తూ విస్తుపోయింది రాజీ. అరుణ మెళ్ళో నల్ల పూసలు, మంగళ సూత్రాలు, కాలికి మట్టెలు - అరుణ పెళ్ళి చేసుకుందా?! ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోతోంది రాజీ.

"మా బాబు...." చిన్న పిల్లాడు తల్లి చేయి పట్టుకు నిలబడ్డాడు.

"అమ్మాయిగారూ! ... జానకమ్మగారు బాగున్నారా అండీ? మీరు పెళ్ళి చేసుకున్నారా?" అరుణ రాజీ వంకే చూస్తోంది, ఏదో మాట్లాడుతోంది.

రాజీ ఒక్క మాట కూడా వినే స్థితిలో లేదు.

రాజీ నడుస్తోంటే, వెనక అరుణ, పిల్లాడు నడిచారు.

రాజీ చేతిలో కూరల సంచీ అరుణ పట్టుకుంది.

ఇంట్లోకి రాగానే అరుణకి ఒక్కసారి వెళ్ళి జానకమ్మ పాదాలకి నమస్కరించాలనిపించింది.

"అదిగో అమ్మ" .... గోడ మీద తల్లి పటాన్ని చూపించింది రాజీ.

"నువ్వా వెళ్ళిపోయాక రెండు రోజులకే అమ్మ హార్టు ఎటాక్‌తో పోయింది...." రాజీ ముందు గదిలో కెళ్ళింది.

"అటు చూడు .... నాన్న"-

అరుణకి నోట మాట రాలేదు. ఎంతో అందంగా, ఠీవిగా కనిపించే విజయబాబు ఇతడేనా? ఏభై ఏళ్ళ మనిషి డెబ్భయి ఏళ్ళ వాడిలా మంచాన పడివున్న విజయబాబుని చూస్తుంటే, మనసు ఏదోలా అయింది. జాలీ, కోపం, పగ, అసహ్యం, ద్వేషం .... ఏమేమో ఉక్కిరి బిక్కిరిగా, కలగలపుగా మనసుని కలచివేసాయి. డాక్టర్లు చెప్తున్న కొత్త జబ్బు ఇదేనేమో!! ఏమో!? ఆ బాబుగారికి ఆ జబ్బే అయివుంటుంది?

అప్రయత్నంగా తల ఎత్తి, అరుణ గోడ వైపు చూసింది.

ఆ గది గోడ బోసిపోయి వుంది. అరుణ అటు ఇటు చూసింది. ఆ గోడపైన పెద్ద ఫొటో ఫ్రేము వుండేది. జింకపిల్లలు పరిగెడుతుంటే, యువరాజు వేలాడుతున్నాడు ఆ ఫోటో. ఎంతో అందంగా ఉండేది. ఆ బెదురు చూపుల జింక పిల్లలు, ఇంకా అరుణకి కళ్ళకి కట్టినట్టే వున్నాయి. ఆ పటం కింద "మృగయా వినోదం" అనే అక్షరాలు వుండేవి. ఎంత బాగుండేదో ఆ ఫోటో – ఏదీ!!

"అదా - నేనే తీసి అవతల పారేశా" రాజీ కాఫీ కప్పు అరుణకి అందిస్తూ అంది.

విజయబాబు వంక, రాజీ వంక చూస్తూ వుండిపోయింది అరుణ ఓ క్షణం.

"అయ్యో, పాపం, రాజీ...." గుండె గొంతుకలో కొట్లాడుతుంటే, పిల్లాడి చెయ్యి పట్టుకు నడిచింది అరుణ, గేటు తీసుకుని.

గేటు తలుపు వేస్తూ "ఆ రోజు తెల్లవారు ఝామున తనే కదూ ఈ గేటు తలుపు తీసి అరుణని పారిపొమ్మని చెప్పింది. అలా తలుపు ఆనాడు తీయకపోతే, ఈనాడు అరుణ ఇలా తల్లిలా, అందంగా, హాయిగా వుండేదా – తను అరుణకి మేలే చేసింది – కానీ - తనే ఆనాడు గేటు తీయబోతే - రాజీ అప్రయత్నంగా కళ్ళు మూసుకుని, గేటు పట్టుకు అలాగే నిలబడిపోయింది అరుణ వెళ్ళిన వైపు చూస్తూ!!